www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 31 మే 2023



గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

ఏలూరు: గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేపై ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్, టవర్స్‌కు ల్యాండ్ గుర్తింపు, గ్యాస్ పైపులైను, పవర్ గ్రిడ్, ఎపిట్రాన్స్‌కోకు సంబంధించిన విద్యుత్ లైన్లు, కోర్టు సమస్యలు, భూమి మార్కెట్ వ్యాల్యూషన్, తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్, నగదు చెల్లింపులు, ఏజెన్సీలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి తగు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.సురేంద్రనాధ్, ఎపి ట్రాన్స్ కో ఎస్ఇ సిహెచ్ విజయ్ కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, తహశీల్దార్లు, పవర్ గ్రిడ్, గ్యాస్ పైపులైన్ కంపెనీ అధికారులు, ఏజెన్సీలు, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యాన

ఉద్యోగుల ఒకరోజు సామూహిక నిరాహార దీక్ష




కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టిన ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎపి జెఎసి అమరావతి మూడోదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఒక్క రోజు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో జెఎసి అమరావతి సభ్య సంఘాలైన రెవెన్యూ, పంచాయతీ రాజ్, రూరల్ వాటర్ సరఫరా, భాషా పండిత ఉపాధ్యాయులు, మున్సిపల్ టీచర్లు, మున్సిపల్ మినిస్టీరియాల్ ఎంప్లాయిస్, గ్రామ/వార్డ్ సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ డ్రైవర్లు, సిఐటియు, ఎఐటియుసి నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధశాఖలకు చెందిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ కె.రమేష్ కుమార్ మాట్లాడుతూ జెఎసి అమరావతి పక్షాన ఉద్యోగుల న్యాయమైన సమస్యలు, డిమాండ్‌లపై 81 రోజులుగా గాంధేయమార్గంలో ఉద్యమం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టకుండా మీనమేషాలు లెక్కించడం సబబుకాదని, త్వరితగతిన సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగులు మెరుపు సమ్మెకైనా సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం మేల్కొని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఈ నిరాహార దీక్ష శిబిరాలే ఆమరణ నిరాహార దీక్ష శిబిరాలుగా మారుతాయని, దానికి పూర్తిబాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. జూన్ ఎనిమిదో తేదీన గుంటూరులో నాలుగో ప్రాంతీయ సదస్సు ఎద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. జెఎసి జిల్లా జనరల్ సెక్రటరీ రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎఐటియుసి జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరావు, కృష్ణమాచార్యులు, సిఐటియు జిల్లా కన్వీనర్ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, ఎపి జెఎసి అమరావతి నాయకులు సిహెచ్. వర్మ, వేణు, ఆర్.శ్రీకాంత్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహాలక్ష్మి, గ్రామ/వార్డ్ సచివాలయ ఉద్యోగుల నాయకులు జ్యోతి, హుస్సేన్, సాయినాథ్, వివిధ ఉద్యోగ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నీరుగార్చేందుకు బిజెపి కుట్ర




పోలవరం మండలంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - పోలవరం

దశలవారీగా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి విమర్శించారు. మండలంలోని ప్రగఢపల్లి పంచాయతీ పరిధి రేపల్లెవాడ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను మంగళ వారం పరామర్శించి వారి సమ స్యలు అడిగితెలుసుకున్నారు. అనం తరం రవి మాట్లాడుతూ ఉపాధి కూలీల సౌకర్యాలను క్రమక్రమంగా బిజెపి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వేసవి అలెన్సులు ఆపేసిందని, పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు, మజ్జిగ వంటివి కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. కూలీలకు ఇచ్చే సమ్మర్ అలవెన్స్ 30శాతం వేతనం ఇవ్వడం లేదని తెలిపారు. ఐదు కిలోమీటర్లు దాటి పనులకు వెళ్లే వారికి ఆటో ఛార్జీలు కలిపి ఇవ్వాల్సి ఉందని, కానీ అమలు కావడం లేదన్నారు. 200 రోజులు పని కల్పించి రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడెల్లి వెంకట్రావు, పోలోజు నాగేశ్వరరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఉపాధి కూలీల బకాయి వేతనాలు వేతనాలు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. మండలంలోని దేవులపల్లి బుచ్చమ్మ చెరువులో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం, మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు పర్యటించారు. ముందుగా ఉపాధికూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవరత్నం మాటా ్లడుతూ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది నుంచి బకాయిలు రాక, పే స్లిప్పులు ఇవ్వాలని కూలీలు అధికారులను అడుగుతుంటే స్పందించకపోవడం దుర్మార్గమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దెందులూరు: ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెరుగుగూడెం, చల్లచింతలపూడి, శ్రీరామవరం, దెందులూరు, రామారావుగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ పనులు రోజురోజుకూ తగ్గిపోవడంతో ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరిగిందన్నారు. వ్యవసాయంలో వాణిజ్య పంటలు రావడంతో కూలీలకు పనిదినాలు తగ్గిపోవడం వల్ల ఉపాధి హామీ చట్టం పేదలకు వరంగా మారిందన్నారు. ఈ తరుణంలో చట్టాన్ని బిజెపి నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉపాధి హామీలో రెండు పూటల పనివిధానం, రెండు ఫొటోల విధానం తీసుకొచ్చి కూలీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ సిగ్నల్ సరిగా లేకపోవడం వల్ల ఫొటోలు అప్‌లోడ్ కాక కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు మెడికల్ కిట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు.



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రం అందిస్తున్న ఎంఎల్ఎ

జాబ్ మేళాను వినియోగించుకోండి

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రతినెలా జాబ్‌మేళా నిర్వహిస్తామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. చింతలపూడి పట్టణంలో మేగాజాబ్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామన్నారు. నెలలో రెండు పర్యాయాలు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. 500 మంది చింతలపూడిలో జాబ్ మేళాను సద్వినియోగం చేసుకున్నారన్నారు. డిగ్రీ పూర్తయ్యి నైపుణ్యం లేని వారు స్కిల్ డెవలప్‌మెంట్ పెంచుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం స్కిల్ హబ్‌ను కూడా ఏర్పాటు చేసిందన్నారు. యువత కష్టపడి చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. నిత్య జీవితంలో కొత్తకొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకుసాగాలన్నారు. టెక్నికల్ స్కిల్స్‌తో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విజయరావు, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నీరజ, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఎం.సాయిబాబు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

బాల కార్మికుల దుస్థితి నుండి బయటకు తీసుకువచ్చి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలకార్మిక రహిత వ్యవస్థను రూపొందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. విద్యాశాఖ, పోలీస్, కార్మిక శాఖ, బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, వైద్యశాఖ, తదితర శాఖల అధికారులతో బాలకార్మికులను గుర్తించి వారిని పనుల్లో నుంచి పాఠశాలలోకి చేర్పించాలని తెలిపారు. వచ్చే జూన్‌లో సంబంధిత అధికారులతో తనిఖీలు నిర్వహించాలని దీనికి సంబంధించిన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవడం నేరమని వీటిని అతిక్రమించిన యాజమాన్యంపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాలని జిల్లా ఉప కార్మిక కమిషనరు కుమారి సిహెచ్.ఆలోచనను కలెక్టర్ ఆదేశించారు. బాల కార్మికులుండే ప్రదేశాలను గుర్తించి తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఎక్కువగా భిక్షాటన చేసే బాలలను రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోను అలాగే హోటళ్లు, కిరాణాషాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రదేశాలలో పనిచేసే వారిని గుర్తించాలని తెలిపారు. బడిమానేసిన పిల్లల జాబితాను విద్యాశాఖ ద్వారా తెప్పించుకొని పిల్లలను తిరిగి పాఠశాలల్లో జాయిన్ చేసేలాగా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉప కార్మిక కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి బాలల ఫొటోతో సహా 9492555073 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. తద్వారా బాల కార్మిక నిర్మూలనకు సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి భాస్కరరావు, డిఇఒ రవిసాగర్, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ రత్నకుమారి, డిసిపిఒ సిహెచ్ సూర్యచక్రవేణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, నాయకులు

వేంపాడు అగ్రహారం భూముల

సాగుదారులకు హక్కు కల్పించాలి

జాతీయ రహదారి బాధితులకు న్యాయం చేయాలి

కలెక్టరేట్ వద్ద రైతులు, బాధితులు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూజివీడు మండలం వేంపాడు అగ్రహార రైతులకు ఉరితాడుగా ఉన్న జిఒలు నెం.79, 102 రద్దు చేసి రైతులకు ఆ భూమిపై హక్కులు కల్పించాలని, మచిలీపట్నం నుండి కల్లూరు వరకు నిర్మిస్తున్న 216హెచ్ జాతీయ రహదారిలో భూములు, ఇల్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం, వేంపాడు భూ హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో రైతులు, బాధితులు ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నూజివీడు మండలం గొల్లపల్లి రెవెన్యూ గ్రామ శివారు వేంపాడు అగ్రహార ఈనాం ఎస్టేట్ భూములైన 3,356 ఎకరాల్లో అనాదికాలంగా గొల్లపల్లి, మీర్జాపురం, దేవరగుంట, మొర్సపూడి, కొత్తపల్లి గ్రామాల్లోని 1353 మంది చిన్న, సన్నకార రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీటిని హైకోర్టు 1971లో ఎస్టేట్ భూములుగా నిర్ధారించి సాగుదారులకు హక్కు కల్పించాలని తీర్పు ఇచ్చిందన్నారు. దేవాదాయ శాఖ సుప్రీంకోర్టును ఆశ్రయించగా 1990లో సుప్రీంకోర్టు 1600 ఎకరాల్లోని రైతుల వద్ద ఎకరాకు ఒక క్వింటా వేరుశనగ కాయలు ఆలయ నిర్వహణకోసం భక్తి పూర్వకంగా చెల్లించాలని రాజీ ఒప్పందం చేయడమే కాకుండా హైకోర్టు తీర్పును సమర్ధిస్తూ ఆర్డర్ ఇచ్చారని వివరించారు. 2003లో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం వేంపాడు సాగుదారులకు హక్కులు కల్పించేందుకు జిఒ 430 విడుదల చేసి ఫీల్డ్, పొజిషన్ సర్వే పూర్తయిన దశలో దేవాదాయ శాఖ లిటిగేషన్‌తో హైకోర్టులో జిఒ 430 రద్దు అయిందని తెలిపారు. 2016లో జిఒ 79 ద్వారా 3356 ఎకరాలు వేంపాడు భూమి మొత్తం రఘునాథస్వామికి హక్కు కల్పిస్తూ పట్టా ఇవ్వడమే కాకుండా జిఒ 102 ద్వారా 1353 మంది రైతులను కౌలుదారులుగా ప్రకటించటంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. ఆ జిఒలను ఆసరా చేసుకుని దేవాదాయ శాఖ రైతులను భూముల నుండి తొలగిస్తామని వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేంపాడు ఈనాం ఎస్టేట్ గ్రామాన్ని సెటిల్ చేసి, జిఒ 79, 102లను రద్దు చేసి వేంపాడు సాగుదారులకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

216 జాతీయ రహదారిలో భూములు, ఇళ్లు, జవనాధారమైన షాపులు కోల్పోతున్న బాధితులతో ఎలాంటి చర్చలూ జరపకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమని విమర్శించారు. సర్వం కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం అందించాలని, వెంటనే గ్రామ సభలు జరిపి ప్రజల, రైతుల అభ్యంతరాలు స్వీకరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎన్.మూర్తికి అందజేశారు. రైతుల ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేరుగు లెనిన్ బాబు, గోగినేని అప్పారావు, తటుకులూరి రంగారావు, చల్లారి రాఘవయ్య, వరుగు శ్రీరంగం, గోగినేని రఘు ప్రసాద్, పిండి చిన్నమ్మ, పాపమ్మ, నందిగం అరుణ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

22.549 మిలియన్ల విద్యుత్ కోటాకు , 20.027 మిలియన్ల యూనిట్ల మాత్రమే వాడకం

ట్రాన్స్‌కో ఎస్ఇ పి. సాల్మన్ రాజు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయం విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఎపిఇపిడిసిఎల్ కృషి చేస్తుందని ట్రాన్స్‌కో ఎస్ఇ పి.సాల్మన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం పెరిగిందని, దీనికి అనుగుణంగా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈనెల 29వ తేదీకి 22.549 మిలియన్ల విద్యుత్ కోటా ఉన్నప్పటికీ, 20.027 మిలియన్ల యూనిట్ల మాత్రమే వాడకం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కరెంటు కోటాను ఎపిఇపిడిసిఎల్ పరిధిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం సాంకేతిక సమస్యలతోనే సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయే తప్ప సంస్థ పరిధిలో ఎక్కడా విద్యుత్ కోతలను అమలుచేయడం లేదని సాల్మన్ రాజు స్పష్టం చేశారు. ఎండల తీవ్రత, అధికలోడు వల్ల 220కెవి ఉండి ఇహెచ్‌టి సబ్‌స్టేషన్‌లో మూడు ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ కారణంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అక్వాసాగు రైతులకు కొంతమేరకు విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయి, తప్ప ప్రస్తుతం ఎలాంటి విద్యుత్ కొరత లేదని జిల్లాలో ఎక్కడా విద్యుత్ కోతలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. 28వ తేదీ ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు భారీ చెట్లు విరిగిపడి తీగలు తెగిపోవడం, ఎలక్ట్రికల్ స్తంభాలు కూలిపోవడం చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, ఎనిమిది ప్రాంతాల్లో 20 స్తంభాలు, నాలుగు ట్రాన్స్ ఫార్మర్లు కూలిపోవడంతో ఇఇ/ఆపరేషన్/జంగారెడ్డిగూడెం/చింతలపూడి నగర పంచాయతీలోనే ఉండి నిరంతరాయంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు పర్యవేక్షించి పక్క మండలాల నుంచి సిబ్బందితో నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన విద్యుత్ పనులు చేపట్టి పనులు వేగవంతంగా పూర్తిచేశామన్నారు. ప్రస్తుతం చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేదని ఎస్ఇ తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఏదైనా విద్యుత్‌కు అంతరాయం లేదా సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సమస్య వెంటనే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ఎపిఇపిడిసిఎల్‌కు సహకరించాలని ఆయన కోరారు.



సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ప్రజలు

సర్వర్ డౌన్

ముదినేపల్లిలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రెండు రోజులుగా సాంకేతిక సమస్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రెండు రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. భూముల మార్కెట్ విలువ జూన్ ఒకటి నుంచి పెరుగుతాయన్న నేపథ్యంలో సర్వర్ డౌన్ కావడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు సర్వర్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. మంగళవారం సాయంత్రానికి కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో కొనుగోలుదారులు పలు రకాలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. భూములు మార్కెట్ విలువ పెంచేవరకు సర్వర్ సమస్య ఇలాగే ఉంటుందా, ఇదే జరిగితే స్టాంపు డ్యూటీలో భారీ వ్యత్యాసంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని, ఇన్ని రోజులు లేనిది ఇప్పుడు సమస్య ఎందుకొచ్చిందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ విలువ పెరుగుతుందన్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ పెరగడంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగి సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు సమాచారం. ముదినేపల్లిలో మంగళవారం సాయంత్రం వరకు ఒక రిజిస్ట్రేషన్ కాలేదు. సర్వర్ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో కొనుగోలుదారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెండు రోజులుగా పడిగాపులు పడ్డారు. దీంతో వృద్ధులు, వికలాంగులు కార్యాలయం వద్ద అవస్థలు పడ్డారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ పి.మధుబాబును వివరణ కోరగా సెంటర్ సర్వర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక సమస్య ఏర్పడడంతో రిజిస్ట్రేషన్లు నిచిచిపోయినట్లు ఆయన చెప్పారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కైకలూరు

చేపల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ హామీ ఇచ్చారు. స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్‌లో చేపల రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆక్వా రైతులు చేపల పెంపకానికి వినియోగించే ఫార్మలిన్ వల్ల ఇతర రాష్ట్రాల్లో వస్తున్న అభ్యంతరాలు, చేపల పెంపకానికి వినియోగిస్తున్న కోళ్ల వ్యర్థాలను వినియోగించడంపై చర్చించారు. చేపలను కొనుగోలు చేసే వ్యాపారులకు ఇస్తున్న ఐదు శాతం రిబేటుపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో చేపల రైతుల సంఘం నాయకులు జంపన రామలింగరాజు, గాదిరాజు సుబ్బరాజు, పెద్దిరెడ్డి రాము, రవిరాజు, రుద్రరాజు మురళి పాల్గొన్నారు.

భార్షీ వర్షానికి ముదినేపల్లి అల్లాకల్లోలం

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

విద్యుత్ శాఖకు రూ.ఐదు లక్షల మేర నష్టం

మూడుచోట్ల తీగలపై పిడుగులు

రోడ్లపై కూలిన చెట్లు



జలమయమైన రోడ్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి మండలం అల్లకల్లోల్లం అయింది. భీకర గాలి, వానతో పాటు పిడుగుల శబ్దాలతో, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పిడుగుల శబ్దానికి మండల ప్రజలు భయకంపితులయ్యాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా పెద్ద పెద్ద ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడింది. గంటకు పైగా కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముదినేపల్లిలోని రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు, ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. పలు కాలనీల్లోకి నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భీకరగాలికి మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలి తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని వైవాక, అన్నవరం, కొత్తపల్లి గ్రామాల్లో విద్యుత్ తీగలపై పిడుగులు పడ్డాయి. దీంతో తీగలు తెగిపోయి అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖకు రూ.5లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఎఇ పి.రవికుమార్ తెలిపారు. భీకర గాలికి రోడ్లపై, విద్యుత్ తీగలపై చెట్లు పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వర్షం తగ్గిన తర్వాత ఎఇ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది పర్యటించి విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా చేపట్టారు. సాయంత్రానికి కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా చేపట్టగా, మిగిలిన గ్రామాల్లో రాత్రి పొద్దుపోయే వరకు పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామాలు అంధకరంగా మారే పరిస్థితి ఉంది.



విద్యుత్ పునరుద్ధరణ పనులు

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొత్తం 12,182 మందికి 10,988 మంది హాజరయ్యారు. 1,194 మంది గైర్హాజరయ్యారు. 92 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 10,867 మందికి 10,052 మంది హాజరు కాగా 815 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తి విద్యా విభాగంలో 1,315 మందికి 936 మంది హాజరు కాగా 379 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొత్తం 4,144 మందికి 3,553 మంది హాజరు కాగా 591 మంది గైర్హాజరయ్యారు. 86 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 3,434 మందికి 3,015 మంది హాజరు కాగా 419 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తి విద్యా విభాగంలో 710 మందికి 538 మంది హాజరు కాగా 172 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

చెరువుల అభివృద్ధికి తోడ్పడాలి



మొక్కలు నాటుతున్న ఎ.రాము

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

చెరువుల అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రాము తెలిపారు. మండలంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా దర్భగూడెం, గంగన్నగూడెం చెరువుల వద్ద జరుగుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.272 వేతనం వచ్చేలా పనులు చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి పని దినాలు కల్పించాలని సిబ్బందిని ఆద శించారు. అమృత్ సరోవర్‌లో భాగంగా మండలవ్యాప్తంగా కొన్ని చెరువులను ఎంపిక చేశారని, వాటిని సుందరవనంగా తీర్చి దిద్దాలని ఆదేశించారు. చెరువు చు ట్టూ మట్టిని పోసి నీటిని నిల్వ ఉండేలా చేయాలని సూచించారు. అనంతరం మొక్క లు నాటారు. ఆయనతో పాటు ఎపిడి ప్రఫుల్, ఎంపిడిఒ మంగతాయారు, స ర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, ఎపిఒ జాన్ వెస్లీ పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమాలను చేపట్టినట్టు ఛైర్మన్ జి.నూకరాజు తెలిపారు. దీనిలో భాగంగా వడ్లపట్ల గ్రామంలో కుటుంబ యజమానులు చనిపోయిన కారణంగా ఇబ్బందులు పడుతున్న మూడు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులను అందించామన్నారు. వీటికి అదనంగా వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న ముగ్గురికి వైద్య సహాయం కోసం ఒక్కొక్కరికి రూ.ఐదువేల చొపున మొత్తం రూ.15 వేలు నగదు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, పి.సాంబశివరావు, జి.రమణ శంకర్ పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వట్లూరులోని డిటిడిసి హాలులో మంగళవారం జరిగిన పెదపాడు మండలానికి సంబంధించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమానికి దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెదపాడు మండలంలోని గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను ప్రదానం చేసి, వారిని సన్మానించారు. సిఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఎంఎల్ఎ పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎసి ఛైర్మన్, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపి సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమాజంలో ప్రతిఒక్కరూ బాలికల విద్యను ప్రోత్సహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి తెలిపారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఆడపిల్లలను రక్షించు- ఆడపిల్లలను చదివించు నినాదంతో బాలికల విద్యపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ లింగ వివక్షను రూపుమాపడానికి కృషి చేయాలని తెలిపారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాన్నారు. పౌష్టికాహారం అందించాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దిశా యాప్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

దిశాయాప్‌పై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని నూజివీడు సిఐ అంకబాబు అన్నారు. మండలంలోని ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎం.కుటుంబరావు ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాల మహిళా సంరక్షణ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అసాంఘిక కార్యకలపాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా చట్టాల గురించి అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని టిడిపి చింతలపూడి నియోజకర్గ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు అన్నారు. మండవ లక్ష్మణరావు ఇంటి వద్ద మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలకు హర్షించదగినదేనన్నారు. ప్రజల జీవన విధానం మెరుగుపరచుకోవటానికి ఉపయోగపడే మేనిఫెస్టో అన్నారు. నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుంటుపడి ప్రజల జీవన విధానం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

'వైసిపి పాలన అద్భుతం'

ప్రజాశక్తి - కైకలూరు

వైసిపి పాలన అద్భుతమని ఆ పార్టీ నేతలు అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జగన్ పాలనకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం సంబరాలు చేశారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణతో కలిసి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు అడవి వెంకట కృష్ణ మోహన్, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు, కైకలూరు మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు దండే పుష్పలత, సర్పంచి దానం మేరి నవరత్నకుమారి, వైస్ ఎంపిపిలు కూసంపూడి కనకదుర్గ రాణి, అగస్తి ఆదివిష్ణు పాల్గొన్నారు.

చింతలపూడి :2019లో ప్రజా పాలన మొదలైయిందని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎంఎల్ఎ ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫైర్‌స్టేషన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్, కొప్పుల నాగు, మిర్యాల దిలీప్, వెంపాకృష్ణ పాల్గొన్నారు.

భీమడోలు : వైసిపి అభ్యున్నతికి కృషి చేసిన, సహకరించిన, కొనసాగుతున్న కార్యకర్తలందరికీ ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో భీమడోలులోని ఒక ప్రయివేట్ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి ప్రజా సంక్షేమ పాలనకు నాలుగేళ్లు అనే పేర నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల ప్రతినిధులు సొసైటీ అధ్యక్షులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పట్టాయిగూడెం వ్యక్తి మరణించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మెడివెట్టివారిగూడేనికి చెందిన టి.అరవింద్ పట్టాయిగూడెం లైన్‌మెన్ వద్ద సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అరవింద్ పట్టాయిగూడెంలో ఎల్‌సి తీసుకుని విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా ఇండక్షన్ రావడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీనిపై విద్యుత్ శాఖ ఎడి రాధాకృష్ణను వివరణ కోరగా దీనిపై పూర్తి విచారణ చేపతుడున్నామని, షిఫ్ట్ ఆపరేటర్, లైన్‌మెన్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - కైకలూరు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆలపాడు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆలపాడు వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కొల్లేటికోట గ్రామానికి చెందిన పేటేటి ఉదయ్ తేజ (30) తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఉదయ్‌తేజ కొల్లేటికోట శ్రీ పెద్దింట్లమ్మ ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశాస్త్రి ఏకైక కుమారుడు. తండ్రితో పాటే ఆలయంలో పూజాధికాలు చేస్తుంటాడు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంపిపి అడవి కృష్ణ, దేవస్థాన ఇఒ గోపాలరావు, కొల్లేరు గ్రామాల పెద్దలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఉత్తమ బోధన, అత్యుత్తమ ఫలితాలు సూర్య సొంతం

పాఠశాల ప్రిన్సిపల్ వేములపల్లి దుర్గాచైతన్య



ప్రజాశక్తి - ఉంగుటూరు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని గొల్లగూడెం సూర్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నూటికి 91 శాతం ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని పాఠశాల ప్రిన్సిపల్ వేములపల్లి దుర్గాచైతన్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గొల్లగూడెం-నల్లమాడు దారి సువిశాలమైన ప్రాంగణంలో అన్ని వసతులతో ఉన్న ఈ పాఠశాలలో 34 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. వారిలో 31 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 550 మార్కులు సాధించిన వారు పది మంది, 530 పైబడి మార్కులు సాధించిన వారు 16 మంది కాగా 490 నుంచి 529 మధ్య మార్కులు సాధించిన వారు ఐదుగురు విద్యార్థులున్నారు. నిపుణులైన ఉపాధ్యాయులతో తక్కువ ఫీజులకే కార్పొరేట్ స్థాయి బోధన చేస్తున్నామని నిర్వాహకులు చెప్పారు.

లాంగ్‌టర్మ్ ఎంసెట్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక
సూర్య పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ వేములపల్లి దుర్గాచైతన్య

గొల్లగూడెం పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు మా పాఠశాలలో నాణ్యమైన బోధనతో మంచి ర్యాంకులు సాధిస్తున్నారు. ఇటీవల టెన్త్ ఫలితాల్లో మా విద్యార్థులు మండల ప్రథమం రావడం సంతోషంగా ఉంది. ఇక్కడి విద్యార్థుల్లో ముగ్గురు ఇంటర్మీడియట్‌లో ఎంసెట్, ఐఐటీ లాంగ్ టర్మ్ కోచింగ్‌లకు ఎంపికవడం గర్వంగా ఉంది. సువిశాలమైన క్రీడామైదానంతో పాటు, అన్ని వసతులతో తరగతి గదులు, ఉపాధ్యాయులు మా ప్రత్యేకత.

ఐఐటీలో సీటు సాధిస్తాం
చాట్రాది భావన మండల టాపర్



మాది యర్రమిల్లిపాడు. నాన్న నాగేశ్వరరావు రైతు. తల్లి నాగలక్ష్మి గృహిణి. ఐఐటీలో సీటు సాధించి ఉన్నత శిఖరాన్ని చేరుకోవాలనే పట్టుదలతో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చదవి మంచి మార్కులు సాధించాను.

ఐఐటీలో సీటు కోసం కృషి
ముళ్లపూడి పూర్ణకార్తికేయ



మాది వ్యవసాయ కుటుంబం. నాన్న ఉమామహేశ్వరావు సాధారణ రైతు. ఐఐటీలో సీటు సాధించే లక్ష్యంతో పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా చదివాను. 576 మార్కులు రావటం సంతోషంగా ఉంది.

ఐఎఎస్ లక్ష్యం
దాసరి పూజిత



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు ఎంతో కష్టపడి చదివించారు. 575 మార్కులు వచ్చాయి. ఐఎఎస్ చదివి ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఆకాంక్ష.

సివిల్ ఇంజినీర్ అవుతా
కట్రెడ్డి మహి శ్రీవల్లి



నల్లమాడు పంచాయతీ రామచంద్రపురం మా ఊరు. తల్లిదండ్రులు వ్యవసాయ దారులు. పూర్వ ప్రాథమిక విద్య అంగన్‌వాడీ కేంద్రం. పదో తరగతి సూర్య పబ్లిక్ స్కూల్‌లో చదివి మంచి మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. సివిల్ ఇంజినీర్ అవ్వాలని అవ్వాలన్నదే లక్ష్యం.

కార్మికులకు అండగా సిఐటియు

జిల్లావ్యాప్తంగా ఆవిర్భావ వేడులు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు

సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు జిల్లా కార్యాలయం అల్లూరు సత్యనారాయణ భవన్ వద్ద జిల్లా ప్రధాన డివిఎస్‌విడి.కార్యదర్శి ప్రసాద్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.సుందరయ్య మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు దేశవ్యాప్తంగా వీరోచిత పోరాటాలు నిర్వహించిందన్నారు. సిఐటియు పోరాటాల ఫలితంగా ఎన్నో చట్టాలు సాధించాగలిగామన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాల సాధనలో సిఐటియు చేసిన అవిశ్రాంత కృషి ఎంతో ఉందన్నారు. సిఐటియు కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడం కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఐవి.సుధాకర్, కె.విజయలక్ష్మి, టిపిఆర్ దొర, జై.గోపి, విజిఎంఆర్.కృష్ణారావు, అరుణ కుమారి, టికె.రావు, ప్రసాద్, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ఎన్.రమేష్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సూర్యరావు అధ్యక్షతన జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంత మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ వర్కర్స్ స్తూపం, పాత మున్సిపల్ క్యారాలయం వద్ద సిఐటియు స్తూపం, ఆర్‌డిఒ కార్యాలయం, బస్టాండ్ , ప్రజాసంఘాల కార్యలయం స్తూపం వద్ద సిఐటియు జెండాలు ఎగురవేశారు. అనంతరం ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా విస్తరించిందని తెలిపారు. సిఐటియు పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందన్నారు. కార్మికులకు అండగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు యు.సత్యనారాయణ, మున్సిపల్ అధ్యక్షులు బి.బాలరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, జి.వెంకటేష్, శాంతారావు, ప్రసాద్, యేసు, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘం కార్యదర్శి జిఎస్.నారాయణ, ఆటో వర్కర్స్ యూనియన్ బి.నాని, సునీల్, స్టాలిన్ పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు, అడవికొలను గ్రామాల్లో సిఐటియు ఉపాధి హామీ కార్మికుల ఆధ్వర్యంలో లావేటి చంద్రరావు అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గవర సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రంగారావు, వెంకటేశ్వరరావు, శ్రీను, వాసు, వెంకటలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు ఆధ్వర్యంలో నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయం ఆవరణలో సిఐటియు జెండా ఆవిష్కరించారు. భువనపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో గోక సూరిబాబు జెండా ఆవిష్కరించారు.



జంగారెడ్డిగూడెంలో...

చింతలపూడి :సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని సీతానగరం గోద్రెజ్ ఆయిల్ ఫ్యాక్టరీ కార్మికులు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ కార్మిక సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సిఐటియు కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు ఎస్.సూర్య కుమార్ జెండా ఆవిష్కరి ంచారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌డి.జవుల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సరళ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.పద్మ పాల్గొన్నారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఎం.బాలరాజు వందన సమర్పణ చేశారు.

బుట్టాయగుడెం : స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలుం పుష్ప, తెల్లం రామలక్ష్మి, పూనెం భూదేవి, పోసమ్మ, మొడియం రమయమ్మ పాల్గొన్నారు.

ఉంగుటూరు : చేబ్రోలులో సిఐటియు మండల అధ్యక్షులు సీరా అప్పారావు, ఉంగుటూరులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ట్రక్ ఆటో యూనియన్ అధ్యక్షులు టేకి శ్రీనివాస్ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో చాపలమడుగు గోపీచంద్, పి.రాజు, బోస్, సుధాకర్, రౌతు పురుషోత్తం, కొడవలి వెంకటరాజా, మరపట్ల ముత్యాలు, వెల్లగాటి మంగ, టి.బాబి, కర్ణం రాంబాబు, కె.సత్యనారాయణ, ఇ.నందిని, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చాట్రాయి :చాట్రాయిలో సిఐటియు మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కరరావు ఆధ్వర్యంలో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవడం కోసం, హక్కులను పోరాడి సాధించుకోవడం కోసం సిఐటియు ఏర్పడిందన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు జి.రాజు, సంసోను రాంబాబు, కుమారు కామేశ్వరరావు జెండా ఆవిష్కరించారు.

కొయ్యలగూడెం :కొయ్యలగూడెం మెయిన్‌సెంటర్‌లో బజార్ జట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, బస్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, శ్రీ వెంకట సత్యనారాయణ రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద, సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి మరిడియా, కె.సీతారాముడు, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కరటూరి రాజు, ఎస్.శివకుమార్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ డి.హైమావతి, సింహాచలం పాల్గొన్నారు.



భీమడోలులో...


భీమడోలు :కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. మండలంలోని పాతూరు గ్రామంలో సివిల్ సప్లైస్ గోదాం వద్ద మంగళవారం నిర్వహించిన సిఐటియు ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై గోదాము హమాలీల సంఘం నాయకులు మత్తే ప్రసాద్, గడ్డి సూర్యారావు శ్రీను, దుర్గారావుతో పాటు అధిక సంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి రామయ్య

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారం కోసం నేరుగా అధికారులతో సంప్రదించాలని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనుమాల రామయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు తాము లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిష్కారం చేయకుంటే మూడు నెలల వ్యవధి తర్వాత తిరిగి జరిగే సర్వసభ్య సమావేశంలో ప్రస్తావిస్తున్నారని, దీనివల్ల సమస్యల పరిష్కారంలో కొంత జాప్యం జరుగుతుందని తెలిపారు. దీని నివారణకు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ వారు పరిష్కరించకుంటే తన దృష్టికి తెచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. రూ.35.50 లక్షల ఎంపిపి నిధులతో పైపులైన్, రోడ్ల పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలను సమర్పించారు. ఇదే క్రమంలో గతంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరైన రూ.80 లక్షల పనులు జరగడం లేదని, అవి మురిగిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఆ పనులను పూర్తి చేయాలని కోరారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేసే క్రమంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వపరంగా వారికి రాయితీపై అందిస్తున్న వివిధ రకాల నిర్మాణ సామగ్రి వివరాలను తెలిపి వారిని చైతన్య పరచాలని కోరారు. జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా మాట్లాడుతూ భీమడోలు గ్రామపంచాయతీకి తాగునీటి అవసరాల కోసం అదనంగా ఏర్పాటు చేసిన బోరు పనులు ఎంఎల్ఎ సహకారంతో పూర్తయినప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేక దానికి సేవలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమబద్ధీకరించే క్రమంలో భీమడోలు మండల ప్రజా పరిషత్‌కు స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అందించిన పూళ్ల ఎంపిటిసిని అభినందించారు. గుండుగొలను పిహెచ్‌సి వైద్యులు ప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పున:వ్యవస్థీకరణలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం రెండు, మూడు ప్రాంతాలను పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానం చేశారని, ఇదే క్రమంలో ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఇతర మండలాలకు అందే సేవలను సర్దుబాటు చేశారని తెలిపారు. భీమడోలు గ్రామపంచాయతీ ఒకటి సచివాలయం గుండుగొలను ప్రాథమిక కేంద్రానికి అనుసంధానంగా పనిచేస్తుందని తెలిపారు. భీమడోలు తహసిల్దార్ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ మండలంలో సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో భాగంగా రీసర్వే కార్యక్రమం పది రోజుల్లో ప్రారంభమవుతుందని తెలిపారు. ఆగడాలు లంక సర్పంచి బలే రాంబాబు మాట్లాడుతూ ఆగడాలలంక, చెట్టున్నపాడులకు లైన్‌మెన్లు లేనందున విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ట్రాన్స్‌కో భీమడోలు ఎఇ రామస్వామి మాట్లాడుతూ భీమడోలు మండలంలో విద్యుత్ సేవలు అందించే క్రమంలో జూనియర్ లైన్‌మెన్ కొరత ఎక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ కార్యాలయం ద్వారా చేపట్టే జలకళ బోరు పనులు పూర్తయ్యే అవకాశం కనపడటం లేదని కొందరు సభ్యులు తెలపగా దీనిపై స్పందించిన ఉపాధి హామీ అధికారులు జలకళ పనులు పూర్తయ్యేందుకు ప్రభుత్వం గతంలో పెట్టిన షరతులను కొంతమేరకు మార్చిన నేపథ్యంలో జాప్యం జరుగుతుందని, ఇదే క్రమంలో ఇచ్చే రాయితీ సైతం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి హెచ్. పద్మావతిదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రామయ్య

అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని నూగొండపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనుల్లో సుమారు రూ.30లక్షల మేర అవినీతి జరిగిందని, సదరు అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని, నూగొండపల్లి గ్రామ సచివాలయ కన్వీనర్ కందుల శివ శ్రీనివాసరావు,మల్లిబోయినపల్లి కన్వీనర్ ముల్లంగి యోహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. దీనిపై ఎంపిడిఒ కె.వాణిని వివరణ కోరగా నూగొండపల్లి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ చట్టం పనులపై విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడినవారిపై చర్యలు చేపడతామని చెప్పారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - ముసునూరు

బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి అన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా మంగళవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ధనలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని, 18 ఏళ్లు నిండిన తర్వాత బాలికలకు వివాహం చేయాలన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొడాలి నాని వ్యాఖ్యలకు టిడిపి నిరసన

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొడాలి నాని కాపులపై చేసిన వ్యాఖ్యలు అనుచితమని టిడిపి కాపు నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రహదారి నారాయణపురంలో శాంతి యుతంగా నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని కాపు నాయకులను స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌కు తరలించే క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసన చేసే హక్కు ఎందుకు హరిస్తున్నారంటూ నాయకులు ప్రశ్నించారు. కొడాలి నాని ఒక కులంపై చేసిన వ్యాఖ్యలకు అతనిని ఎందుకు అరెస్టు చేయడంలేదన్నారు చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో కాపు నాయకులు మాట్లాడుతూ కాపులకు కొడాలి నాని వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూసనపూడి పుల్లయ్య నాయుడు, మారిశెట్టి ప్రసాద్, పసుపులేటి నరసింహ, నక్కిరి పెద్దిరాజు, పత్సా వంశీ, ఆకుల శ్రీను, యడ్లపల్లి రామకృష్ణ, తలగళ్ల వెంకటేశ్వరరవు, ఈతకోత బాబి, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

జంగారెడ్డిగూడెం :సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలను స్థానిక మహేష్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ జయంతి సందర్భంగా యువసేన వ్యవస్థాపకులు బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. 31వ తేదీన స్థానిక వంద పడకల ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన మూగజీవాల సంరక్షణ నిమిత్తం గోవులకు మేత, వీధి కుక్కలకు పాలు, బిస్కెట్లు, ఆహారం అందిస్తామని తెలిపారు. అలాగే అడవుల్లో నివసిస్తున్న కోతులకు అరటి పండ్లు, జామకాయలు వేరుశనగపప్పు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సూపర్‌స్టార్ కృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహేష్ యువసేన సభ్యులు ఎస్.పవన్, ఎస్.ప్రశాంత్, ఎంబి.శ్రీను, సూర్య సీతారాం, ఎం.నాగబాబు, పాల్గొన్నారు.

బిఎస్‌పి కైకలూరు ఇన్‌ఛార్జిగా నారాయణ

ముదినేపల్లి :బహుజన సమాజ్‌వాది పార్టీ కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మండలంలోని చినపాలపర్రుకు చెందిన జి.నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ముదినేపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి కైకలూరు నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌ఛార్జిగా నారాయణకు నియమాక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నందున కష్టానికి ప్రతిఫలంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.